# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

## తేదీ: 21-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సీసీ కెమెరాల నిఘాతో నేరాలను అరికట్టవచ్చని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.
- ❖ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఫార్మా పరిశ్రమలో ఈరోజు అగ్ని ప్రమాదం జరిగింది.
- ❖ పెట్టుబడిదారులు రాష్ట్రంలోని అవకాశాలను అందిపుచ్చుకుని పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.
- ❖ విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో వుందని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

=======================

సీసీ కెమెరాల నిఘా ద్వారా నేరాలను అరికట్టవచ్చని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. హోంశాఖపై ఈరోజు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చందబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. అనంతరం హోం మంత్రి అనిత పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని రద్దీగా ఉండే ప్రదేశాలు, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని, కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆ సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. గతంలో దాదాపు 15 వేల సీసీ కెమెరాలు ఉంటే వాటిలో కొన్ని పని చేయటం లేదని, మరికొన్ని కొత్తవి కావాలన్నారు. గత ప్రభుత్వం సీసీ కెమెరాల బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. 11 కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు, అలాగే పోలీసు శాఖలో కొత్త వాహనాలను కొనుగోలు చేసేందుకు ముఖ్యమంత్రి అనుమతించారని హోం మంత్రి అనిత ఈ సందర్భంగా తెలియజేశారు.

=======================

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని "ఎసెన్సియా" ఫార్మా పరిశ్రమలో ఈరోజు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో ఇప్పటివరకు ముగ్గురు మరణించారని, 27 మందికి గాయాలయ్యాయని కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, పరిస్థితిని కలెక్టర్, ఎస్పి లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. కాగా ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రియాక్టర్ పేలడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీస్ లు ప్రాధమికంగా అంచనా వేశారు.

======================

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పనకు కట్టుబడి ఉందని సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడలో జరిగిన "కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేటివ్" సమావేశంలో ఈరోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులకు అన్నిరకాల అవకాశాలున్నాయని, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని పరిశ్రమలు ప్రారంభించాలన్నారు. పారిశ్రామికవేత్తలందరూ ఏకతాటిపైకి వచ్చి రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి తోడ్పాటును అందించాలని కోరారు. రాష్ట్రంలో 100 ఎం.ఎస్.ఎం.ఈ. పార్క్ లను క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================

విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈరోజు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి ఆయన ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనుల్లో భాగమైన 7 ఇండస్ట్రియల్ ఎస్టేట్ లకు నీటి సరఫరా పనులు, భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

విరామం

======================

విశాఖ పర్యటనలో భాగంగా రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఈరోజు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావుతో కలిసి స్టీల్ ప్లాంట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో వుందని అన్నారు. స్టీల్ ప్లాంట్ కు ఉపయోగపడే మాంగనీస్, ఇసుక గనుల లీజు రెన్యువల్స్ తమ ప్రభుత్వం వచ్చాకే జరిగిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లో తయారయ్యే ఉక్కు అత్యంత నాణ్యమైనదని రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాల కోసం, ప్రభుత్వ గృహనిర్మాణ పథకాలకు ఉపయోగించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=======================

"సబ్ కా సాత్.. సబ్ కా వికాస్" నినాదంతో దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరులో పార్టీ సభ్యత్వ నమోదుపై ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి, విధివిధానాలతో భారతీయ జనతా పార్టీ పని చేస్తోందని తెలిపారు. కార్యకర్తలే బీజేపీకి బలమని, రాష్ట్రంలో 37 లక్షల మంది భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తీసుకున్నారని పురందేశ్వరి తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అరవింద్ మీనన్, సిద్ధార్థనాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

=======================

ఆంధ్రప్రదేశ్, యానాం మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఉరుములతో కూడిన మెరుపులు బలమైన ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

=======================

హెల్త్ వెల్ నెస్ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని పార్వతీపురం మన్యం జిల్లా డిప్యూటీ వైద్యారోగ్య అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. పార్వతీపురం మండలం చిన బొండపల్లి, ఎంఆర్ నగర్ లలో వెల్ నెస్ కేంద్రాలను ఈరోజు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు అందించిన వివరాలను పరిశీలించి చికిత్స వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారి హిమోగ్లోబిన్ శాతం తగ్గుముఖం పడకుండా పర్యవేక్షణ చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

=======================

విశాఖ జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు గ్రౌండ్ కాని గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పెదగంట్యాడ మండలం నడుపూరులోని 160 ఎకరాల్లో నిర్మితమవుతున్న గృహాల లే-అవుట్ ను కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిర్మాణ దశలో ఉన్న గృహాలన్నీ త్వరితగతిన పూర్తికావాలని అన్నారు. ప్రతి రోజు పురోగతి ఉండాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నడుపూరు లే అవుట్ లో 6 వేల 216 గృహాలను మంజూరు చేయగా, 403 గృహాల నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లే అవుట్లలో గృహాలు సకాలంలో నిర్మాణం జరిగేలా ప్రణాళికలు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెకర్టర్ ఆదేశించారు.

=======================

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గిరిజన ఉద్యోగ అభ్యర్థులకు డిఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయిం తీసుకుందని పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఎ ఇన్ ఛార్జ్ ప్రాజెక్టు అధికారి ఎస్.ఎస్ శోబిక తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు.

=======================
=======================